సాక్షి తిరుపతి

బుధవారం । 28 । జూన్ । 2023



పరిశ్రమలకు ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అండగా నిలుస్తూ ప్రోత్సహిస్తుందని కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. - 8లో



జగనన్నకు చెబుదాంతో సత్వర న్యాయం

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై త్వరగతిన న్యాయం చేయాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	26
చిత్తూరు	36	26
తిరుమల	33	22
గూడూరు	39	28
నగరి	38	27

న్యూస్‌రీల్

వైభవం.. పార్వేట ఉత్సవం



బల్లెం ప్రయోగిస్తున్న అర్చకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం శ్రీవారి మెట్టు సమీపంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి వేంచేపు చేశారు. అక్కడ క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బల్లెంను ప్రయోగించే ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు. ఆస్థానం అనంతరం సాయంత్రానికి స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నై రోడ్డులో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంలో ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం కనులపండువగా జరిగింది. శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం వేదోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తన్మయత్వం చెందారు. తదుపరి శ్రీస్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

దశకంఠుడిపై పరాశరేశ్వరస్వామి



రావణ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం రావణ వాహనంపై విహరిస్తూ శివపార్వతులు భక్తులను కటాక్షించారు. ఉదయం నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి శివగామీ సమేత నటరాజస్వామి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం చంపకవల్లి, పరాశరేశ్వర స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం రావణ వాహనంపై ఊరేగింపు నయనానందకరంగా సాగింది. స్థానిక ఆలయాల ఏఈవో పార్థసారథి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో తొమ్మిది కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,175 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.29 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ భక్తులకు సకాలంలో దర్శనం అవుతోంది. దర్శనం టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



సుపరిపాలనకే ఓటు

"ప్రజా సేవే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుక్షణం పరితపిస్తుంటారు.. పేదల సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారు.. అన్ని వర్గాల అభ్యున్నతికి నిత్యం కృషి చేస్తుంటారు.. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తుంటారు.. రాష్ట్రాభివృద్ధికే తొలి ప్రాధాన్యమిస్తూ శ్రమిస్తుంటారు.. అయితే చంద్రబాబు ఇందుకు పూర్తి విరుద్ధంగా నడుచుకుంటారు.. ప్రజల ఓట్లే పరమావధిగా అనుక్షణం మోసం చేస్తుంటారు.. నిరుపేదల కష్టాలను చులకనగా చూస్తుంటారు.. సంపన్న వర్గాలకు అనుకూలంగానే పనిచేస్తుంటారు.. దిగజారుడు రాజకీయాలతో ప్రజాతీర్పునే పరిహాసం చేస్తుంటారు.. వ్యక్తిగత అజెండాకే ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాభివృద్ధికి మోకాలడ్డుతుంటారు.. మాట మీద నిలబడే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి.. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే చంద్రబాబుకు ఇదీ తేడా'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వివరించారు.

- పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- చంద్రబాబువి మాయమాటలు
- 35 ఏళ్లుగా కుప్పం నియోజకవర్గానికి చేసింది శూన్యం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం
- రామకుప్పం పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం/రామకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకే ప్రజలు ఓటేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రామకుప్పం మండలంలో పల్లెబాట నిర్వహించారు. అందులో భాగంగా 89 పెద్దూరు, ననియాల తాండ, వీర్నమల, బళ్ల, ఉన్సిగానినూరు, విజలాపురం, కంచనబళ్ల, రామకుప్పంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వెల్లడించారు. పేద పిల్లలు సైతం సౌకర్యవంతంగా చదువుకునేందుకు నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో అమ్మఒడి కింద ఏటా రూ.15వేలు జమ చేస్తున్నారని తెలిపారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించారని వివరించారు. నాలుగేళ్ల సుపరిపాలనకు.. కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు హయాంకు తేడాను ప్రజలు గుర్తించాలని కోరారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయాలను దిగజార్చిన చంద్రబాబుకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడం తథ్యమని స్పష్టం చేశారు.

చంద్రబాబుది దశాబ్దాల మోసం

కుప్పం ప్రజల ఓట్లతో 35 ఏళ్లుగా గెలుపొందిన చంద్రబాబు దశాబ్దాలుగా నియోజకవర్గ వాసులను మోసం చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. దేశంలోనే సీనియర్‌ని అని చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా సొంత నియోజకవర్గంలో ఒక్క పంచాయతీ అయినా తిరిగారా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి, తర్వాత పట్టించుకోరని ఆరోపించారు.

బాబుది బూటకపు మేనిఫెస్టో

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అప్పట్లోనే చంద్రబాబు కాపీ కొట్టారని, ఇప్పుడు కూడా మళ్లీ బూటకపు మేనిఫెస్టోను ప్రకటిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి మండిపడ్డారు. గతంలో అమ్మఒడి నాన్న బుడ్డి అని హేళన చేసిన బాబు, ఇప్పుడు పిల్లలను బడికి పంపితే అమ్మకు వందనం అందిస్తామంటూ మళ్లీ వైఎస్సార్‌సీపీనే కాపీ కొడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మరో రెండు మేనిఫెస్టోలను విడుదల చేస్తామంటున్న చంద్రబాబు.. అందులో మహిళలకు కేజీ బంగారం, రైతుకు ట్రాక్టర్, యువతకు బుల్లెట్ బైక్‌లను పంపిణీ చేస్తామన్న పథకాలను పేర్కొన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి.. అబద్ధపు హామీలు గుప్పించే చంద్రబాబుకు తేడాను కుప్పం ప్రజలు గుర్తించాలని సూచించారు.

ఏరు దాటాక తెప్ప తగులబెట్టినట్లు చంద్రబాబు వ్యవహారశైలి ఉంటుందని తెలిపారు. కుప్పం పర్యటనకు అప్పుడప్పుడు వచ్చి తూతూమంత్రంగా రెండు సభల్లో మాట్లాడి మళ్లీ హైదరాబాద్‌కు చెక్కేస్తారని ఎద్దేవా చేశారు.

4రోజులు.. 40 సభలు

కుప్పం నియోజకవర్గం గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో నాలుగు రోజులపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట నిర్వహించారు. ప్రతి చోటా జనంతో మమేకమవుతూ.. ప్రజా సమస్యలపై స్పందిస్తూ.. వారి భవిష్యత్‌కు భరోసానిస్తూ పర్యటించారు. మంత్రి పెద్దిరెడ్డి పర్యటనకు.. చుట్టంచూపుగా వచ్చే చంద్రబాబుకు తేడాను కుప్పంవాసులు స్పష్టంగా గమనించారు. ఇటీవల 3 రోజులపాటు చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. ఒక్క బహిరంగసభలో మాత్రమే పాల్గొన్నారు. కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి తన నాలుగురోజుల పర్యటనలో ప్రజల యోగక్షేమాలు, అవసరాలు తెలుసుకునేందుకే ప్రాధాన్యమిచ్చారు. గుడుపల్లె మండలంలో 17, రామకుప్పం మండలంలో 16 బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అడుగడుగునా నీరా'జనం'

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనకు జనం నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. కొడతనపల్లెలో భూమి పట్టాలు పొందిన 230 రైతు కుటుంబాలు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలపడం విశేషం. నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎంపీ రెడ్డెప్ప : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాటతో ముందుకు వచ్చారు. తర్వాత మీ ఇంటికి మీ మంత్రి పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడతారు.

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం : 50శాతం రిజర్వేషన్లకు గతంలో బీసీలు పోరాడారు. అయితే జగనన్న 64శాతం రిజర్వేషన్లు అందిస్తున్నారు. బీసీలందరూ ఈ విషయాన్ని గుర్తించాలి.

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మంచి కార్యక్రమాలు చూసి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలి.

ఎమ్మెల్సీ భరత్ : కుప్పం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం. ఏ సమస్య వచ్చినా.. అర్ధరాత్రి తలుపు తట్టినా అండగా నిలుస్తాం.

టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ : టీడీపీ నేతలు నాలుగు దశాబ్దాలుగా కుప్పం ప్రజలను మోసం చేస్తున్నారు.



ఉన్సిగానిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తూ..



గజమాలతో ఘన స్వాగతం అందుకుంటూ..



రామకుప్పం సభలో జనసందోహం

చంద్రబాబే దళిత ద్రోహి

- బాబును అధికారంలోకి తెచ్చేందుకు జగనన్నపై రామోజీ పిచ్చిరాతలు
- రామోజీ దిష్టిబొమ్మ, ఈనాడు ప్రతుల దహనం



రామోజీని దున్నతో పోలుస్తూ వినూత్న నిరసన



రామోజీరావు దిష్టిబొమ్మను పాడెపై ఊరేగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో దళితులను విస్మరించడంతో పాటు దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..? అంటూ అవహేళన చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ 'ఏలుబడిలో నెలకు ముగ్గురు ఎస్సీ, ఎస్టీలు హతం' శీర్షికన మంగళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. జగనన్న పాలనలోనే దళితులపై హత్యలు జరుగుతున్నాయని పిచ్చిరాతలు రాయిస్తావా? రామోజీ అంటూ మండిపడ్డారు. ఆపై ఈనాడు యాజమాన్యాన్ని దున్నపోతుతో పోలుస్తూ తిరుపతి ఆటోనగర్ వద్ద రామోజీ దిష్టిబొమ్మతో పాటు ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబును ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలన్న దురాలోచనతో రామోజీ పత్రికా విలువలను దిగజారుస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమన్నారు.

జగనన్న హయాంలోనే ఆత్మగౌరవం

జగనన్న అధికారంలోకి వచ్చాకే దళితుల ఆత్మగౌరవం పెరిగిందని, ఉన్నత పదవులు అధిరోహించ గలిగారని అజయ్‌కుమార్ తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలతో దళితులు ఎంతో సుభిక్షంగా జీవిస్తున్న విషయం రామోజీరావ్‌కు కనిపించలేదా? అని ప్రశ్నించారు. జగనన్నపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే ఈనాడు పత్రికను, చంద్రబాబును ప్రజలు ఛీకొడతారే తప్ప నమ్మేస్థితిలో లేరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కూడా దళితులంతా జగనన్నను తిరిగి సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మరోసారి ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తే ఖబడ్దార్ రామోజీ అంటూ హెచ్చరించారు. కార్పొరేటర్లు హనుమంత్‌నాయక్, కోటూరు ఆంజనేయులు, 1వ డివిజన్ అధ్యక్షుడు ఆదం సాయికుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు బొగ్గుల వెంకటేష్, శ్యామల, దాస్ పాల్గొన్నారు.

దేశంలోనే అత్యుత్తమంగా శ్రీపద్మావతి ఆస్పత్రి

- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి
- చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి భవనం పనుల పరిశీలన



భవనం శ్లాబ్‌ను పరిశీలిస్తున్న ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదా భార్గవి, సీఈ నాగేశ్వరరావు

తిరుపతి తుడా: టీటీడీ నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి దేశంలోనే అత్యుత్తమంగా నిలుస్తుందని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. అలిపిరి సమీపంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణం కోసం సేకరించిన భూమిలో ఉన్న రుయా ఆస్పత్రి క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్స వార్డును పరిశీలించా రు. ఆస్పత్రి నిర్మాణం వేగంగా పూర్తి చేయాల్సి ఉండడంతో ఈ వార్డును తాత్కాలికంగా మరో చోటికి తరలించాలని రుయా అధికారులకు సూచించారు. ఆ వార్డుకి సంబంధించి కొత్త భవనం నిర్మించి రుయాకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డిసెంబర్‌లో ప్రారంభించేలా చర్యలు

ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడా ది డిసెంబర్‌లో ఆస్పత్రి ప్రారంభించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న చిన్న పిల్లల హృదయాలయం ప్రపంచంలోని ఉత్తమ ఆస్పత్రుల సరసన చేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 1450 గుండె ఆపరేషన్లు నిర్వహించి పిల్లలకు కొత్త జీవితం ప్రసాదించినట్లు చెప్పారు. జీవన్ దాన్ కింద నాలుగు గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించారని తెలిపారు. కొత్తగా నిర్మించే ఆస్పత్రిలో చిన్న పిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో పాటు న్యూరో, న్యూరో సర్జరీ, పల్మనాలజీ, యూరాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం ఆస్పత్రి పనుల ప్రగతిపై సమీక్షించారు. జేఈవో సదా భార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మణమూర్తి, చిన్న పిల్లల గుండె చికిత్సల ఆస్పత్రి ఆర్ఎంవో భరత్, ఈఈ కృష్ణారెడ్డి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చదువులకు మామయ్య భరోసా

మీరు చదువుకోండి..నేను చదివిస్తాను అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడికి శ్రీకారం చుట్టారు. వరుసగా నాలుగో విడత తల్లుల ఖాతాల్లోకి బుధవారం రూ.15వేల నగదు జమ చేయనున్నారు. గత పాలకుల మొక్కుబడి చదువులు...జగనన్న పాలనలో విద్యాభివృద్ధిని తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. జగనన్న పాలనలో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, పాఠశాల ప్రారంభంలోనే కిట్లు, నాణ్యమైన ఇంగ్లిష్ విద్య, సీబీఎస్ఈ సిలబస్‌తోపాటు రుచికరమైన మెనుతో భోజన సౌకర్యం తదితరాలపై సర్వాత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



అమ్మఒడి పోస్టర్

- నేడు నాలుగో విడత అమ్మఒడి
- తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ
- గూడూరులో జిల్లా కార్యక్రమం
- జిల్లాలో 1,68,377 మందికి లబ్ధి
- రూ.252.56 కోట్ల కేటాయింపు

తిరుపతి అర్బన్: పేదింటి బిడ్డలు సైతం పెద్ద పెద్ద చదువులు చదువుకునేందుకు సర్కార్ అండగా ఉండడంతోపాటు నాడు- నేడు కార్యక్రమంలో పాఠశాల రూపురేఖలు మార్పు చేయడమే కాకుండా సకల వసతులు కల్పిస్తోంది. అమ్మఒడి కార్యక్రమంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పిస్తున్నారు. చిన్న పిల్లలను కూలి పనులకు కాకుండా ఎంచెక్కా స్కూళ్లకు పంపుతున్నారు. అమ్మఒడి కింది నాలుగో విడతలో 1,68,377 మంది తల్లుల ఖాతాల్లో బుధవారం రూ. 252.56కోట్లు జమ కానుంది. గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు

తెల్లరేషన్ కార్డు కలిగి ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పిల్లలకు లబ్ధి అందుతుంది. ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.15వేలు కేటాయిస్తున్నారు. ఈ మొత్తంలో పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణకు రూ.2వేలు మినహాయించి మిగిలిన రూ.13వేలు విద్యార్థుల తల్లులఖాతాల్లోకి జమ చేస్తున్నారు.

ఇంతకన్నా ఏం కావాలి



మాది పేద కుటుంబం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే శక్తి కూడా లేదు. అమ్మఒడి డబ్బులతో నేను చదువుకుంటున్నా. నాడు–నేడు మనబడితో పాఠశాల రూపురేఖలు మార్పు చేయడంతోపాటు పుస్తకాల కిట్టును అందించారు. ఇంగ్లిష్ మీడియం, నాణ్యమైన విద్య, రుచికరమైన వంటకాలతో భోజనం పెడుతున్నారు. ఇంతకన్నా ఏం కావాలి. సీఎం జగన్ సార్‌కు కృతజ్ఞతలు.

– యోగేష్, పదోతరగతి విద్యార్థి

జగన్ మామయ్య ఆశయాలు నెరవేరుస్తా



రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో బడిఈడు పిల్లలంతా బడిలో చేరుతున్నారు. మాది అదే పరిస్థితి. బడికి దూరం అవు తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అమ్మ ఒడితో పాటు ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దారు. దీంతో బడికి వెళ్లి బాగా చదువుకుంటున్నాం. జగన్ మామ య్య ఆశలను నెరవేర్చేలా ఉన్నతస్థాయికి చేరుకుంటాం. సీఎం జగన్ మామయ్యకు రుణపడి ఉంటాం.

– వెంకటేష్, పదో తరగతి విద్యార్థి

చదువులకు ఆర్థిక భరోసా



అమ్మఒడి ద్వారా ప్రభుత్వం నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంది. దీంతో విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా ఏర్పడింది. వరుసగా నాలుగో విడత అమ్మఒడి ఇస్తున్నారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తున్నారు. దీంతో పిల్లల సంఖ్య పెరుగుతుంది.

– వి. శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి

స్పందనపై నిర్లక్ష్యం.. ఇద్దరు సస్పెన్షన్

తిరుపతి తుడా: 'జగనన్నకు చెబుదాం' ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు వార్డు సెక్రటరీలను సస్పెండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం 'జగనన్నకు చెబుదాం', స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడాన్ని గుర్తించి ఇటీవల ఇద్దరు వార్డు సెక్రటరీలపై చర్యలు తీసుకున్నారు. అయినా వారి తీరు మారకపోవడంతో కమిషనర్ హరిత చర్యలకు దిగారు. 10వ వార్డు సచివాలయంలోని వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ కె.కిషోర్‌బాబు స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై ఈనెల 23వ తేదీ నుంచి ఎగ్జిక్యూటివ్ అథారిటీ అధికారి పలుమార్లు హెచ్చరించినా, పరిష్కరించక కాలయాపన చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. రాజీవ్ నగర్ జీవకోన 46/1 వార్డులోని అమినిటీస్ సెక్రటరీ కె.ఆనంద్ స్పందన ఫిర్యాదుపై ఎగ్జిక్యూటివ్ అథారిటీ అనుమతి పొందకుండానే నిర్లక్ష్యంగా సమాధానం అప్లోడ్ చేశాడు. సదరు ఫిర్యాదారుడు సమస్యను పరిష్కరించలేదని మళ్లీ రీ ఓపెన్ చేశారు . దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ హరిత ఆ ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సెట్ కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సూచించారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధిత సెక్రటరీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

25 ఏళ్ల తరువాత టీచరైన వేళ..


ఉపాధ్యాయుడు రమణయ్య దంపతులకు సన్మానం

వాకాడు : 1998 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి.. 25 ఏళ్లుగా వివిధ రకాల కష్టాలను ఎదుర్కొని నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మండలంలోని నెల్లిపూడి గ్రామానికి చెందిన నూతలపాటి రమణయ్య ప్రయివేట్ గుమస్తా నుంచి టీచర్‌గా మారారు. ఈ సందర్భంగా శ్రీరామసే ఆధ్వర్యంలో బాలిరెడ్డిపాళెం శ్రీపట్టాభిరామాలయంలో నూతన ఉపాధ్యాయుడు రమణయ్య దంపతులను సత్కరించారు. వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి చేతులు మీదుగా సన్మానించారు. అర్చకుడు దీవి అనంతాచార్యులు, సభ్యులు హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే వెంకటగిరి నుంచి పోటీ చేయాలి

- ఎమ్మెల్యే పదవి జగనన్న ఇచ్చిన భిక్ష
- ఆనంకు నేదురుమల్లి సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: మాజీ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి ధైర్యముంటే వెంకటగిరి నుంచి పోటీ చేయాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం రాపూరు మండలం గోనుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మీ అధినాయకుడిని ఒప్పించి వెంకటగిరిలో పోటీ చేయాలని ఆనంకు సవాలు విసిరారు. ఇద్దరం ఒకే చోట పోటీ చేస్తే, వెంకటగిరి ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో తెలుస్తుందన్నారు. ఆత్మకూరులో పోటీ చేయాలని విక్రమ్‌రెడ్డి, నెల్లూరులో పోటీ చేయాలని అనిల్‌కుమార్ కోరుతున్నారని, ఆనం ఎక్కడ పోటీ చేసినా ప్రజలు ఓడించడం ఖాయమని తెలిపారు. వెంకటగిరి రాజాలు మిమ్మల్ని గెలిపించేందుకు కాళ్లు అరిగేలా తిరిగితే, వారిని కాదని టీడీపీకి చెందిన వ్యక్తికి పోలేరమ్మ ఆలయ చైర్మన్ పదవి ఇచ్చి అవమాన పరిచింది, ఆల్తూరుపాడు కాలువ పనులను అడ్డుకుంది, జగనన్న కాలనీలో అవకతవకలు చేసింది మీరు, మీ అనుచరులు కాదా అని ప్రశ్నించారు. దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని విమర్శించడం సంస్కారహీనమని పేర్కొన్నారు. 1997 బాపట్ల, 1999లో నరసారావు పేట, 2004లో విశాఖపట్నంలో నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేస్తే ఒక్కొక్క చోట 7 నియోజకవర్గాల బాధ్యతలు తీసుకుని విజయం సాధించినట్లు, 2004లో తన తల్లి నేదురుమల్లి రాజ్యలక్ష్మి వెంకటగిరి నుంచి పోటీ చేస్తే తాను ప్రచార బాధ్యతలు చేపట్టడంతో విజయం పొందారని, 2009లో వెంకటగిరిలో తాను ఎన్నికల ప్రచారం చేయలేదని, అప్పుడు ఆమె ఓడిపోయారని పేర్కొన్నారు. మీరు రాపూరులో ఓడిపోలేదా, మీరు మంత్రిగా ఉండి ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఓడిపోలేదా అని ప్రశ్నించారు. ధైర్యం ఉంటే రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నుంచి పోటీ చేయాలన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఆనంరామనారాయణరెడ్డి ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడంలేదని, తెలుగుదేశంలో ఆయన స్థానం ఏమిటో వెంకటగిరిసభలో తెలిపోయిందన్నారు. ప్రజల నుంచి ఆయనకు ఛీత్కారం తప్పదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి


మృతి చెందిన వాణి

– భర్తకు తీవ్రగాయాలు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు నవాబుపేటకు చెందిన కావాలి వాణి(35) మృతి చెందింది. ఆమె భర్త రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వాణి, రమేష్ సత్యవేడులో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లేందుకు నెల్లూరు నుంచి మోటార్ బైక్‌లో బయలుదేరారు. మార్గ మధ్యలో పండ్లూరు కూడలి వద్ద మోటార్‌బైక్‌ను వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న లారీ మోటార్ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వాణి రెండు కాళ్లు పూర్తి నలిగిపోయి తీవ్రంగా గాయపడింది. రమేష్‌కు కూడ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వాణిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో 108 లో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రమేష్‌ను నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్నకు చెబుదాం'పై త్వరితగతిన న్యాయం


సూచనలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

- మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం
- క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై త్వరగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం పోలీస్ గెస్ట్ హౌస్‌లో నేర సమీక్ష సమావేశంలో జిల్లాలోని అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సకాలంలో పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం చేయాలన్నారు. గంజాయి నిర్మూలనకు పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి నిర్మూలించాలని తెలిపారు. డీపీఎస్ యాక్ట్ కేసులకు సంబంధించిన పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. గతంలో ఆపరేషన్ పరివర్తన 2.0 సక్రమంగా అమలు చేసి సత్ఫలితాలను సాధించామని, అదే స్ఫూర్తితో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాదక ద్రవ్య రహిత జిల్లాగా మారే విధంగా కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు.

రౌడీ షీటర్లలో పరివర్తన రావాలి

జిల్లాలో రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో పరివర్తన వచ్చేలా చూడాలని ఎస్పీ తెలిపారు. సస్పెక్ట్ షీట్లు అనుమానిత వ్యక్తుల కదలికలపై, అల్లర్లు సృష్టించే వారిపై నిఘా ఉంచాలన్నారు. రౌడీయిజం, గూండాయిజం చేసే పాత నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. నేషనల్ హైవే ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ అన్ని జాగ్రత్తలను చేపట్టాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సైబర్ క్రైమ్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎర్రచందనం, సారా, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముస్లింలకు సూచించారు. ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


ఆరోగ్య పరీక్షలు చేసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి, పక్కన ఎంపీటీసీ బోస్‌చంద్రారెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. మంగళవారం చంద్రగిరి మండలం ఏరంగంపేటలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, ఏ జబ్బులు దరి చేరకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రక్త పరీక్షలు చేసుకుంటే ఎలాంటి జబ్బులు ఉన్నా ముందుగానే తెలుసుకొని నయం చేసుకోవడానికి వైద్యం తీసుకోవచ్చునన్నారు. ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి వైద్య పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు బోస్‌చంద్రారెడ్డి, సర్పంచ్ ఎర్రయ్య, ఉప సర్పంచ్ మానిష్ రెడ్డి, డీఎల్‌పీఓ రూపారాణి, అధికారులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా


సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న సురేష్ భారతి

గూడూరురూరల్ : సోలార్ విద్యుత్ శక్తి ప్లాంట్లు, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుతో విద్యుత్‌శక్తిని ఆదా చేయవచ్చని భారత్ ఆల్ట్ ఫ్యూయల్ వ్యవస్థాపక డైరెక్టర్ సురేష్ కె.భారతి తెలిపారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి అయోగ్ భారత ప్రభుత్వ భాగస్వామ్యంతో సీఅండ్‌ఐ ఎనర్జీ ట్రాన్సిషన్ సమ్మిట్–2023ను నిర్వహించారు. సురేష్ కె.భారతి మాట్లాడుతూ సోలార్ ప్లాంట్లు, సోలార్ ప్యానెల్స్ విద్యుత్‌శక్తిని ఆదా చేయడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఏసీఐసీ– ఏఎస్‌ఐసీ సీఈఓ డాక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మంచి గాలి, శక్తిలతో కూడిన ప్రపంచాన్ని అందించేలా ప్రయోగాలు రావాలని కోరారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ డాక్టర్ కె.శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈ పరందామయ్య, డైరెక్టర్ ఎ.మోహన్, సౌరభ్, ఏఓ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కండలేరును సందర్శించిన సీడబ్ల్యూఎస్ బృందం


కండలేరును పరిశీలిస్తున్న చైన్నై బృంద సభ్యులు

రాపూరు: కండలేరు జలాశయాన్ని చెన్నై వాటర్ కమిషనర్ బృందం మంగళవారం సందర్శించింది. కండలేరు జలాశయం నుంచి నీటి విడుదల, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ తదితరాలను తెలుసు కున్నారు. అనంతరం తెలుగుగంగ అతిథి గృహంలో కండలేరు జలాశం అధికారులతో సమీక్షించారు. ఈ బృందంలో సీడబ్ల్యూఎస్ ఇంజినీర్లు జయకర్ జేసుదాస్, పార్థసారథి, కళైశెల్వం, అజిత్ కుమార్,రాజా, పళనికుమార్, తెలుగు గంగ ఎస్పీ హరినారాయణరెడ్డి, ఈఈ విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, ఇంజినీర్లు తిరుమలయ్య, డీఈలు,ఏఈలు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలి


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

రేణిగుంట: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించి బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని కార్మిక శాఖ సహాయ కమిషనర్ చిన్న లాలెప్ప హెచ్చరించారు. మంగళవారం రేణిగుంటలోని పలు దుకాణాలు, హోటళ్లను ఆయన వివిధ శాఖల సమన్వయంతో కలసి తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనిలో కాదని అవగాహన కల్పించారు. తిరుపతి సర్కిల్–2 సహాయ కార్మిక అధికారి శ్రీమన్నారాయణ, అధికారులు రాజయ్య, రంగనాథ్, ఐసీపీఎస్ సిబ్బంది దేవయాని తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తప్రోజ్‌బాషా


నియామక పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు షఫీ అహమద్ ఖాదరి

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ తప్రోజ్ బాషా నియమితులయ్యారు. మంగళవారం తిరుపతిలో మైనారిటీ సెల్ కార్యాలయంలో తప్రోజ్ బాషాకు సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహమద్ ఖాదరి నియామక పత్రం అందజేశారు. తప్రోజ్ బాషా మాట్లాడుతూ తనకు పదవి వచ్చేలా సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఎమ్మెల్సీ కేఆర్‌జే.భరత్, సయ్యద్ షఫీ అహమద్ ఖాదరికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు



పిచ్చాటూరు: నాగలాపురం శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. చెన్నై నుంచి తిరుమలకు వెళ్తున్న ప్రభావతి(70), నిర్మల(50) ప్రయాణిస్తున్న కారును పుత్తూరు నుంచి చెన్నై వెళ్తున్న మామిడికాయల వ్యాపారి సలీమ్(40) నడుపుతున్న కార్లు ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరు ముగ్గురికీ గాయాలైయ్యాయి. క్షతగాత్రులను నాగలాపురం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్..
- నిందితులిద్దరూ అన్నదమ్ములు
- 12.50 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుల అరెస్టు, చోరీ సొత్తును చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైం : తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. క్రైమ్ డీఎస్పీ రవి కుమార్ వివరాల మేరకు.. తిరుపతి గోపాల్ రాజు కాలనీలో నివాసం ఉంటున్న ఆకృతి పెంచలయ్య (29), ఆకృతి నవీన్(23) అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి నగరంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడేవారు. 2019 నుంచి ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాలతో పాటు అలిపిరి, ఎంఆర్‌పల్లె, బైరాగిపట్టెడ, వెంకటగిరి, గూడూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలలో చైన్లు లాక్కొని వెళ్లేవారు. తొలుత బతుకుతెరువు కోసం తిరుపతిలో ఆటో నడుపుతూ జీవనం సాగించేవారు. డబ్బులు చాలక పోవడంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. మంగళవారం చంద్రగిరి–తిరుపతి మార్గమధ్యంలోని వకుళమాత ఆలయం సమీపంలో వీరిద్దరినీ అరెస్ట్ చేసి, రూ.12 లక్షల 50 వేల విలువ చేసే 252 గ్రాములు బంగారు, 500 గ్రాములు వెండిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐలు ప్రవీణ్ కుమార్, వెంకటేశులు, ఎస్ఐలు, సిబ్బందిని ఆయన అభినందించారు.

పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అండగా నిలుస్తు ప్రోత్సహిస్తుందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన 21 క్లైములకు రూ. 1.81 కోట్లు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుంచి 146 పరిశ్రమలకుగాను 124 అనుమతులు ఇచ్చామని, మరో 22 పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. 21 పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా రూ.1.81 కోట్లు అందించేందుకు ఆమోదం తెలిపారు. ఏర్పేడు మండలం మాధవమాల గ్రామంలో ఉడ్‌కార్వింగ్ క్లస్టర్, రేణిగుంట మండలంలోని ఎర్రమరెడ్డిపాళెంలో కాపర్ వేజెల్స్ క్లస్టర్, వెంకటగిరిలో శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనంలో పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులు 2022–23 సంవత్సరంలో ఫిబ్రవరి23 నాటికి రూ.15,059.61 కోట్లుగా ఉందని వివరించారు. జిల్లాలో పరిశ్రమలు భద్రత ప్రమాణాలు అమలు చేయాలని చెప్పారు. తిరుపతి, నాయుడుపేట ఏపీఐఐసీకి సంబంధించి పరిశ్రమల కాలపరిమితి పెంపు, సేల్ డీడ్ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి, నాయుడుపేట చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చతుర్వేద హవనం


మైదానంలో ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం గురువారం నుంచి జూలై 5వ తేదీ వరకు టీటీడీ పరిపాలన భవనం వెనుక వైపు ఉన్న మైదానంలో శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం జరుగనుంది. తిరుపతిలో టీటీడీ తొలిసారిగా ఈ హవనం చేపడుతోంది. ఈ మేరకు అత్యంత వేగంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. యజ్ఞ వేదిక, హోమ గుండాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, బ్యారికేడ్లు, భక్తులు కూర్చుని వీక్షించేందుకు మ్యాట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులను ఆకట్టుకునేలా పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 32 మంది రుత్వికులు రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని వేదాల్లోని మంత్రాలు పఠిస్తూ హోమ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పాల్గొనే భక్తులందరికీ యజ్ఞ ఫలం లభించేలా ప్రతి రోజూ ఒకరితో సంకల్పం చెప్పించనున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చతుర్వేద మంత్ర పారాయణం నిర్వహిస్తారు. 6 గంటల నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత, నృత్య ప్రవచన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హిందూ ధర్మప్రచార పరిషత్, శ్రీవేంకటేశ్వర వేదాధ్యయన సంస్థ కీలక భూమిక పోషిస్తున్నాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.